## షూటింగ్ చాంపియన్ సయ్యద్ మునావర్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) వేదికగా జరిగిన స్పోర్ట్స్ ఫర్ ఆల్(ఎస్ఎఫ్ఏ) షూటింగ్ చాంపియన్‌షిప్‌లో యువ షూటర్ సయ్యద్ మునావర్ హుస్సేన్ 10మీటర్ల విభాగంలో స్వర్ణ పతకంతో మెరిశాడు.

## ఏషియన్ ముక్తా సంస్థలకు టోకరా

### బోగస్ బ్యాంక్ అకౌంట్లతో ఉద్యోగి మోసం

### సినీ నిర్మాత ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు

బంజారాహిల్స్, అక్టోబర్ 26: బోగస్ కంపెనీల పేర్లతో బ్యాంక్ అకౌంట్లను సృష్టించి.. ప్రముఖ సినీ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ సునీల్ నారంగ్‌కు చెందిన అకౌంట్‌నుంచి డబ్బులు కాజేసిన ఉద్యోగితో పాటు మరో ఇద్దరిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదయింది. పోలీసుల వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నం. 31లో ఏషియన్ ముక్తా ఏ-2 సంస్థ పేరుతో నిర్మాత సునీల్ నారంగ్ కార్యాలయం నడిపిస్తున్నారు. ఇందులో విశ్వనాథరెడ్డి అనే వ్యక్తి గత ఏడేళ్లుగా అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. కాగా.. గత కొన్నేళ్లుగా విశ్వనాథరెడ్డి.. తన భార్య సఫియా నసీర్, స్నేహితుడు శశాంక్‌తో కలిసి కొన్ని బోగస్ సంస్థల పేర్లతో బ్యాంక్ అకౌంట్లు తెరిచారు. హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్, సాయి నైన్ ఎంటర్‌ప్రైజెస్, తదితర పేర్లతో ఉన్న ఈ బ్యాంకు ఖాతాలకు పలు సందర్భాల్లో డబ్బులు పంపించారు. బోగస్ లెక్కలు చూపిస్తూ ఆయా సంస్థల పేర్లమీదకు రూ.1.47కోట్ల మేర నిధులు పంపించినట్లు ఇటీవల నిర్వహించిన ఆడిట్‌లో తేలింది. ఏసియన్ సంస్థ సీఎఫ్‌వో రాజశేఖర్ యాదవ్, సీఈవో వరుణ్ మల్హోత్రా, మేనేజింగ్ పార్టనర్ సునీల్ నారంగ్ పేర్లతో చెక్కులు తీసుకుని డబ్బులు తమ ఖాతాల్లోకి మళ్లించినట్లు తేలింది. దీంతో తమ సంస్థను మోసం చేసిన విశ్వనాథరెడ్డితో పాటు సఫియా నసీర్, శశాంక్, తదితరులపై చర్యలు తీసుకోవాలంటూ నిర్మాత సునీల్ నారంగ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అద్దెకు ఇచ్చిన ఇల్లు కూల్చివేత

### అడ్డుకునేందుకు జేసీ దివాకర్‌రెడ్డి వెళ్తే బెదిరింపులు

### కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్,అక్టోబర్ 26: తమ వద్ద అద్దెకు తీసుకున్న ఇంటిని.. వేరొకరికి ఇచ్చే ప్రయత్నాల్లో భాగంగా కూల్చివేతలు చేపట్టడంపై ప్రశ్నించేందుకు వెళ్లిన మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి, మేనేజర్‌లను బెదిరింపులకు గురిచేయడంతోపాటు దాడికి యత్నించారు. ఈ సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత జేసీ దివాకర్‌రెడ్డికి జూబ్లీహిల్స్ రోడ్ నం.62లోని ప్లాట్ నంబర్ 1250లో ఉన్న ఇంటిని సాహితీ సంస్థ చైర్మన్ బూదాటి లక్ష్మీనారాయణకు 2020లో అద్దెకు ఇచ్చాడు. మూడేళ్ల గడువు ముగిసిన తర్వాత ఇంటిని ఖాళీ చేయాలని కోరగా.. బూదాటి కొడుకు సాత్విక్ మిస్టిక్ వెల్‌నెస్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఓ బోగస్ అగ్రిమెంట్‌ను సృష్టించి కోర్టులో కేసు వేశాడు. ఈ వ్యవహారంపై గతంలోనే సివిల్, క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలా ఉండగా వారం రోజుల క్రితం జేసీ దివాకర్‌రెడ్డి తోపాటు అతడి మేనేజర్ జగదీశ్ యాదవ్‌లు ప్లాట్ నంబర్ 1250లో ఉన్న ఇంటి వద్దకు వెళ్లారు. అక్కడ ఉన్న ఇంటిని కూల్చేసి స్థలాన్ని చదును చేస్తున్నట్లు గుర్తించిన జేసీ షాక్‌కు గురయ్యారు. ఏడాది కాలంనుంచి అద్దె చెల్లించకపోవడంతో పాటు కోర్టులో తప్పుడు పత్రాలతో కేసులు వేశారని, తమ అనుమతి లేకుండా ఇంటిని ఎలా కూలుస్తారంటూ అక్కడున్న రాజీవ్ సాల్మన్ అనే వ్యక్తిని ప్రశ్నించారు. దీంతో రాజీవ్ సాల్మన్‌తో పాటు ఇతర వ్యక్తులు జేసీ దివాకర్‌రెడ్డి, జగదీశ్ యాదవ్‌లను అక్కడినుంచి వెళ్లిపోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇంటిని కూల్చిన ఫొటోలు తీసేందుకు యత్నించడాన్ని అడ్డుకున్నారు.ఈ స్థలాన్ని సినిమా వాళ్లకు అద్దెకు ఇచ్చారని, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేసేందుకు యత్నిస్తున్నారంటూ జగదీశ్‌యాదవ్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సీట్లు, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం

బంజారాహిల్స్, అక్టోబర్ 26: మెడికల్, ఇంజినీరింగ్ సీట్లు, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మించి పలువురు బాధితుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసిన మోసగాడిపై జూబ్లీహిల్స్ పోలీసులు చీటింగ్ కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీనగర్ కాలనీలో రోహిత్ అనే వ్యక్తి ఆరునెలల క్రితం చెక్‌మేట్ కన్సల్టెన్సీ పేరుతో కార్యాలయం ఏర్పాటు చేశాడు. విదేశాల్లో మెడిసిన్ సీట్లు, మేనేజ్‌మెంట్ కోటాలో ఇంజినీరింగ్ సీట్లు ఇప్పిస్తానంటూ నమ్మించి పలువురివద్దనుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశాడు. అయితే నెలలు గడిచినా సీట్లు రాకపోవడంతో పాటు రోహిత్ బిచాణా ఎత్తేయడంతో శనివారం పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. రంగారెడ్డి నగర్‌కు చెందిన పరశురామ్ కుమార్తెకు ఈ కాలేజీలో మేనేజ్‌మెంట్ కోటా కింద సీటు ఇప్పిస్తానంటూ రూ.12లక్షలు వసూలు చేసి మోసం చేశాడు. కృష్ణదేవరాయనగర్‌కు చెందిన పాగల నందిని వద్దనుంచి విదేశాల్లో ఉద్యోగం పేరుతో రూ.7లక్షలు వసూలు చేయగా, శ్రీనగర్ కాలనీకి చెందిన రచ్చ నవిత కుమార్తెకు వైజాగ్‌లోని గీతం యూనివర్సిటీలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానంటూ రూ.15లక్షలు వసూలు చేశాడు. ఆఫీసు ఏర్పాటు కోసం అంటూ అనురాధ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న రావి గౌతమి వద్దనుంచి రూ.70లక్షలు తీసుకున్న రోహిత్.. వివిధ కారణాలు చెబుతూ కాలయాపన చేశాడు. ఇటీవల గట్టిగా డబ్బులు ఇవ్వాలని కోరగా బాండ్ పేపర్ రాసిచ్చి అక్టోబర్ 25లోగా ఇస్తానంటూ హామీ ఇచ్చాడు. అయితే డబ్బులు ఇవ్వకపోగా ఆఫీసు మూసేసి పరార్ కావడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా చీటింగ్ కేసులు నమోదు చేశారు. రోహిత్ చేతిలో మోసపోయిన బాధితులు వందల సంఖ్యలో ఉన్నారని స్థానికులు చెబుతున్నారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**అభినందన..**

విస్టా ఇంటర్నేషనల్ స్కూల్ స్పోర్ట్స్ మీట్‌లో విజేతలను శనివారం అభినందిస్తున్న భారత మాజీ వాలీబాల్ ప్లేయర్ కిరణ్‌రెడ్డి

# దేశవ్యాప్తంగా బీసీ కులగణన నిర్వహించాలి

అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

రవీంద్రభారతి,అక్టోబర్ 26 : తెలంగాణ తరహాలోనే దేశవ్యాప్తంగా జనగణలో బీసీ కులగణన చేపట్టాలని, బీసీ కులగణనపై బీజేపీ ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించాలని బీసీ సంక్షేమ జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివిధ బీసీ కుల సంఘాల నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీ కులగణన చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ ఇప్పుడు విస్మరించిందని, జనగణనలో కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పది సంవత్సరాలుగా బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను కల్పించకుండా, బీసీ రిజర్వేషన్లను పెంచకుండా, బీసీలపై క్రీమిలేయర్‌ను విధించి అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. తెలంగాణ నోటిఫికేషన్లలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల మూలంగా బీసీ విద్యార్థులకు మెరిట్ ఉన్నప్పటికీ ఉద్యోగాలు రావడంలేదని, కానీ ఈడబ్ల్యుఎస్ వర్గాలకు పరీక్ష రాస్తే ఉద్యోగాలు వస్తున్నాయని ఆరోపించారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో డిసెంబర్ 5, 6తేదీల్లో వేలాది మందితో ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టి ఎర్రకోటను ముట్టడిస్తామన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా తొడుకునూరి సత్యంగౌడ్, రాష్ట్ర కార్యదర్శిగా పండ్ల మనోజ్‌లను శ్రీనివాస్‌గౌడ్ ప్రకటించారు. ఈ సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందాల గణేశ్‌చారి, బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కులచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, తాటి కొండ విక్రమ్‌గౌడ్, దుర్గయ్యగౌడ్, భాస్కర్, సంధ్య, శంకరాచారి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలు చెల్లించాలి

కాచిగూడ,అక్టోబర్ 26 : ప్రభుత్వం విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించి, ఆదుకోవాలని అంబర్‌పేట నియోజకవర్గం ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి పి.నాగేందర్ అన్నారు. ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి నాగేందర్ ఆధ్వర్యంలో రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ.. శనివారం అంబర్‌పేట తాసీల్దార్ హీరాబాయికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను రూ.5,500 నుంచి రూ.20 వేల వరకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివగణేశ్, చూచిత్, సాగర్‌రెడ్డి, బాలు, తదితరులు పాల్గొన్నారు.

తాసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

## అన్ని కులాల గణన చేపట్టాలి

సభలో పాల్గొన్న బీఆర్ఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పుట్ట పద్మారావు

రవీంద్రభారతి,అక్టోబర్ 26 : బీసీ కులగణనతో పాటు అన్ని కులాల జనాభా లెక్కలు వెంటనే చేపట్టాలని బహుజన్ రిపబ్లికన్ సోషలిస్ట్ పార్టీ(బీఆర్ఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు పుట్ట పద్మారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన బీఆర్ఎస్పీ సభలో పద్మారావు మాట్లాడుతూ.. ఎస్సీ గణాంకాలను శాస్త్రీయంగా చేపట్టాలని కోరారు. బహుజనుల రాజ్యం కోసం నిమ్నజాతీ ప్రజలు ఏకంకావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కార్డియాలజిస్ట్ ఎంఎఫ్ గోపీనాథ్, ప్రొఫెసర్ వెంకటాసు, మోహినుద్దీన్,అన్వర్బాన్, హైకోర్టు న్యాయవాది ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పేరిణి నృత్యాన్ని అభివృద్ధి చేసిన ఘనత పద్మశ్రీ డాక్టర్ రామకృష్ణకే దక్కుతుంది

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 26 : ఆంధ్ర నాట్యాన్ని పునరుద్ధరించడంతో పాటు మరుగున పడిన పేరిణి నృత్యాన్ని అభివృద్ధి చేసిన ఘనత భారత కళా ప్రపూర్ణ పద్మశ్రీ డాక్టర్ నటరాజ రామకృష్ణకే దక్కుతుందని స్వర నర్తన అకాడమీ వ్యవస్థాపకులు నర్తకీ దెందులూరి పద్మామోహన్ అన్నారు. శనివారం నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలోని నందమూరి తారకరామారావు ఆడిటోరియంలో నిర్వహించిన నృత్య పోటీలను గురు శ్రీ కళా క్రిష్ణ, ఉమామహేశ్వరి దంపతులు ప్రారంభించారు. కళాక్రిష్ణ మాట్లాడుతూ.. ఆదరణ కోల్పోతున్న ఆంధ్ర నాట్యాన్ని అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. నృత్య పోటీలలో పాల్గొంటున్న విద్యార్థులను ఆయన ఆశీర్వదించారు. పద్మామోహన్ మాట్లాడుతూ.. ఈ ఏడాది 70 మందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాలలో పోటీలను నిర్వహించడం జరిగిందని, ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఆంధ్ర నాట్య కళాకారులు రాధిక, అనుపమ, నవత వ్యవహరించారు. పోటీలలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రోత్సాహకరంగా స్వర నర్తన సంస్థ ద్వారా సర్టిఫికెట్‌తో పాటు బహుమతులను అందజేశారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డిసెంబర్‌లో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేసి బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు. గురువులు పేరిణి కుమార్, పేరిణి శ్రీనివాస్, శారదా రామక్రిష్ణ, రేఖ, సంధ్యా పవన్, స్వప్న, సాత్విక, నిర్వాహకులు నవత, సునీలా, ప్రవంతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

నృత్య పోటీలను ప్రారంభించిన శ్రీ కళాక్రిష్ణ, ఉమామహేశ్వరి దంపతులు

## ప్లాస్టిక్ గోదాం యజమానికి నోటీసులు జారీ

నోటీసులు జారీ చేస్తున్న శానిటరీ అధికారి అర్జున్

చార్మినార్, అక్టోబర్ 26 : 'ప్రాణ సంకటంగా ప్లాస్టిక్ గోదాములు' శీర్షికతో నమస్తే తెలంగాణ పత్రికలో ప్రచురితమైన కథనానికి జీహెచ్ఎంసీ అధికారులు స్పందించారు. చార్మినార్ జోనల్ కమిషనర్ పరిధిలోని చంద్రయాణగుట్ట, సంతోష్‌నగర్, ఫలక్‌నుమా, చార్మినార్; రాజేంద్రనగర్, మలక్‌పేట్ సర్కిళ్ల వారీగా అధికారులు దాడులు నిర్వహించారు. శానిటేషన్ సూపర్‌వైజర్లు బృందాలుగా విడిపోయి సర్కిళ్ల పరిధిలో కొనసాగుతున్న ప్లాస్టిక్ గోదాంలను గుర్తిస్తూ వాటి యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ జోనల్ డిప్యూటీ కమిషనర్ శంకర్‌సింగ్ మాట్లాడుతూ.. చార్మినార్ జోనల్ కమిషనరేట్ పరిధిలోని వివిధ సర్కిళ్ల వారీగా కొనసాగుతున్న ప్లాస్టిక్ గోదాముల యజమానులకు నోటీసులు జారీ చేశామని, రెండు మూడు రోజుల వ్యవధిలో నివాసిత ప్రాంతాల్లోని గోదాములను వెంటనే తరలించాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఈ దాడుల్లో ఏఎల్ఓ అర్జున్ శానిటరీ సూపర్‌వైజర్‌లు ఫక్రుద్దీన్, కృష్ణ, మహ్మద్ కాషిఫ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలి

డ్రైవర్లకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న కాచిగూడ డిపో మేనేజర్ రఘు, సిబ్బంది

కాచిగూడ, అక్టోబర్ 26: ప్రయాణికులకు ఉత్తమ సేవలందిస్తూ సంస్థకు ఆదాయాన్ని సమకూర్చడానికి సిబ్బంది కృషి చేస్తున్నట్లు కాచిగూడ డిపో మేనేజర్ టి.రఘు అన్నారు. కాచిగూడ డిపోలో పనిచేస్తున్న ప్రమాదరహిత, అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లకు అభినందన సభ ఏర్పాటు చేసి, నగదుతోపాటు ప్రశంసా పత్రాన్ని డిపో మేనేజర్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రయాణికులకు సేవలందిస్తూ సంస్థకు ఆదాయాన్ని సమకుర్చడానికి విశేషంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. బ్రేక్‌డౌన్స్ తగ్గించి, జీరో పర్సంటేజ్‌కి తీసుకురావడానికి సిబ్బందితో కలిసి కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, వాసవి, అయోధ్యరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

గోల్కొండ శాతంనగర్‌కు చెందిన షేక్ ఖాదర్‌కు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.2లక్షల చెక్కును శనివారం ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టాలలో ప్రజలకు తాము అండగా ఉంటామని అన్నారు.

– మెహిదీపట్నం, అక్టోబర్ 26

## వీసీ ధరావత్ సూర్య ధనుంజయ్‌కి సన్మానం

మహిళా వర్సిటీ వీసీ ధరావత్ సూర్య ధనుంజయ్‌ను సన్మానిస్తున్న తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 26 : వీరనారి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం ఉప కులపతి తెలుగు సాహిత్యకారిణి, సీనియర్ ప్రొఫెసర్ ధరావత్ సూర్య ధనుంజయ్‌ని శనివారం వర్సిటీలోని వీసీ చాంబర్‌లో తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ మర్యాద పూర్వకంగా కలుసుకొని శాలువా మెమెంటోతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది డాక్టర్ ధనుంజయ్, ఓయూ పీడీఎఫ్ డాక్టర్ రవితేజ చౌహాన్, వర్సిటీ స్పెషల్ ఆఫీసర్ ప్రొఫెసర్ సరస్వతమ్మ, నవ భారత నిర్మాణ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల హేమంత్, తెలంగాణ సిటిజెన్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడగ ఉజ్వల్ చందర్, తెలంగాణ మేధావుల ఫోరం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## టోలిచౌకిలో కేర్ హాస్పిటల్స్ మల్టీస్పెషాలిటీ క్లినిక్ ప్రారంభం

టోలిచౌకిలో కేర్ హాస్పిటల్స్ అంతర్జాతీయ రోగుల కోసం మల్టీ స్పెషాలిటీ క్లినిక్‌ను ప్రారంభించింది. కేర్ హాస్పిటల్స్ సీఈవో జస్‌దీప్‌సింగ్ ప్రారంభించి మాట్లాడుతూ.. కేర్ హాస్పిటల్స్ నాణ్యమైన వైద్యాన్ని అందించడానికి ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ శలభ్‌ఢాంగ్, సీఎఫ్ఓ దీపక్‌ఖన్నా, హైటెక్ సిటీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సునితా అగర్వాల్, పీడియాట్రిక్ సిటీవీఎస్ సర్జరీ విభాగం హెడ్ డాక్టర్ తపన్‌కుమార్‌దాస్, కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ లక్ష్మీనాథ్, ఫిజీషియన్ డాక్టర్ కైలేశ్ మిర్చి, అర్థోపెడిక్ డాక్టర్ శరత్ బాబు, అంకాలజీ హెడ్ డాక్టర్ సుధా సిన్హా తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, అక్టోబర్ 26

## వాటర్ వర్క్స్ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని వినతి

అబిడ్స్, అక్టోబర్ 26 : వాటర్ వర్క్స్ కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయించాలని వాటర్ వర్క్స్ కాంట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధి పొల్కం శ్రీనివాస్ కోరారు. శనివారం సచివాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా కాంట్రాక్టర్ల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, పనులు పూర్తైనంవత్సరాలు గడుస్తున్నా యన్నారు. తక్షణమే బిల్లులు విడుదలయ్యేలా చూడాలని కోరారు.

## జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసిన కార్వాన్ ఎమ్మెల్యే

ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడానికి చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయడానికి అధికారులు కృషి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. శనివారం సాయంత్రం కార్వాన్ ఎమ్మెల్యే జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కలిసి నియోజకవర్గంలోని పెండింగ్‌లో ఉన్న పనులపై చర్చించారు. పనులను వెంటనే పూర్తి చేయడానికి తగిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. దీనికి స్పందించిన కమిషనర్ సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

– మెహిదీపట్నం, అక్టోబర్ 26

## ప్రపంచానికే ఔషధం అందించిన గొప్ప చరిత్ర హైదరాబాద్‌ది

గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా విద్యార్థులకు పట్టాలను అందజేస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ఆర్. లింబాద్రి

అబిడ్స్, అక్టోబర్ 26 : కోవిడ్ సందర్భంగా దేశంతో పాటు ప్రపంచానికే ఔషధం అందించిన గొప్ప చరిత్ర హైదరాబాద్‌కు ఉందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో సరోజినీ నాయుడు వనితా ఫార్మసీ మహా విద్యాలయ చైర్మన్ డాక్టర్ బి. ప్రభాశంకర్ నేతృత్వంలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై.. విద్యను పూర్తి చేసుకుని బయటకు వెళ్తున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో వనితా ఫార్మసీ కళాశాల నంబర్ వన్‌గా ఉందని, విద్యార్థులకు తక్కువ ఖర్చుతో చక్కని బోధన అందించి చదువుకున్న ప్రతి ఒక్కరికీ ప్లేస్‌మెంట్ కల్పించేందుకు యాజమాన్యం పాటు పడుతోందని అన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ బి. ప్రభాశంకర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉత్తమమైన విద్యా బోధన అందిస్తున్నామన్నారు. అంతకు ముందు విద్యార్థినులకు గాడ్యుయేషన్ సర్టిఫికెట్‌లతో పాటు అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పథకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి బి. హనుమంతరావు, కోశాధికారి సంధ్య దేపాల, సంయుక్త కార్యదర్శి చంద్రజిత్‌సింగ్, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి బి. సురేందర్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ ఎన్. శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ టి. మమత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె శిరీష, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లి, దండ్రులు పాల్గొన్నారు.

## యాదవ సంఘం హైదరాబాద్ కమిటీ ఏర్పాటు

యాదవ సంఘం గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఏర్పాటైంది. జాంబాగ్‌లోని యాదవ సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు బోయిని వెంకటేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో నూతన సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి యాదవ సంఘం ప్రతినిధులు అభినందనలు తెలిపారు. – అబిడ్స్, అక్టోబర్ 26

## ఆర్టీసీలో నేటి నుంచి హోమ్ డెలివరీ సౌకర్యం

సుల్తాన్‌బజార్,అక్టోబర్ 26: వినియోగదారుల సౌకర్యార్థం రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ ఈ నెల 27 నుంచి తెలంగాణ, ఏపీ ,కర్ణాటక, మహారాష్ట్రలోని అన్ని కార్గో కౌంటర్‌ల నుంచి హోమ్ డెలివరీ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు రంగారెడ్డి, నల్గొండ రీజియన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(లాజిస్టిక్) సి. రవీందర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని జీహెచ్ ఎంసీ లిమిట్ పరిధిలో 31 కేంద్రాల ద్వారా హోమ్ డెలివరీని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. హోమ్ డెలివరీలో భాగంగా 1వరకు కేజీకి రూ.50, 1నుంచి 5 కేజీలకి రూ.60, 5 నుంచి 10 కేజీలకు రూ.65,10నుంచి 20 కేజీలకి రూ.70, 20నుంచి 30 కేజీలకి రూ.75 చార్జ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించు కో వాలని అన్నారు.

## వైద్య భవన్‌ను పునరుద్ధరించి అందుబాటులోకి తీసుకువస్తాం

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నరహరి

సుల్తాన్‌బజార్,అక్టోబర్ 26: మూతపడిన కోఠిలోని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల వైద్య భవన్‌ను త్వరలోనే పునరుద్ధరించి అందుబాటులోకి తీసుకువస్తామని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నరహరి, సెక్రటరీ జనరల్ డాక్టర్ లాలూప్రసాద్‌రాథోడ్ పేర్కొన్నారు. శనివారం కోఠి లోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. త్వరలోనే సభ్యత్వ